క్లుప్తంగా

క్రీడలు లేని ప్రాంగణాలు



మరికల్: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను బయటకు తీసేందుకు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ప్రస్తుతం వృథాగా దర్శనిస్తున్నాయి. వాటిని కొన్ని గ్రామాల్లో దూరంగా ఏర్పాటు చేయడంతో ముళ్లచెట్లు కమ్ముకున్నాయి. క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకురావడం కోసం అధికారులు సైతం ప్రయత్నం చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం తరపున మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తే తప్ప క్రీడా ప్రాంగణాలు ఉపయోగంలోకి వచ్చే అవకాశం లేదని గ్రామీణ క్రీడాకారులు వాపోతున్నారు.

బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి



మాగనూర్: మండలంలోని నేరడగందొడ్డి గ్రామ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. దశాబ్దాల కాలంగా ఉన్న మట్టి రోడ్లను బీటీలుగా మార్చకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎదైనా అత్యవసర సమయం ఏర్పడితే ఇంకా అంతేసంగతని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గ్రామాలకు బీటీరోడ్డు సౌకర్యం కల్పించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

జోరుగా ఇసుక రవాణా

మాగనూర్: మండల పరిధిలోని నేరడగం గ్రామ పెద్దవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల మేరకు.. మక్తల్ మండ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన కొందరు వారం రోజులుగా పదుల ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. గత వేసవికాలం పంటలకు సరైన నీరందక, బోర్లు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులు మళ్లీ ఇలా ఇసుక అక్రమ రవాణా చేయడంతో భూగర్భ జలాలు ఇంకిపోయి భవిష్యత్‌లో వ్యవసాయానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయని ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ అధికారులు ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

కాంప్లెక్స్ నిర్మాణం జరిగేనా?



మరికల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట చిరు వ్యాపారులకు చెందిన డబ్బాలను తొలగించి రెండు నెలలవుతున్న అక్కడ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన ఎలాంటి సమాచారం లేదు. దీంతో చిరు వ్యాపారుల్లో కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరుగుతాయ లేదా అనే సందేహాలు ఉండటంతో మళ్లి అక్కడే వారి వారి స్థానాల్లో తాత్కాలికంగా గూడరాలను వేసుకొని వ్యాపారం కొనసాగిస్తున్నారు. అధికారులు త్వరగా కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించాల్సి ఎంతైనా ఉంది.

పిడుగు పడి ఎద్దులు మృతి

కోస్గి: పిడుగుపాటుకు గురై రెండు ఎద్దులు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తోగాపూర్‌లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కోస్గికి చెందిన రైతు నీరటి చిన్న కిష్టయ్య ఎప్పటిలాగే తోగాపూర్ శివారులోని తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు రెండు ఎడ్లను, సమీపంలోనే ఆవులను బందించాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన గాలిదుమారం చెలరేగింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు గురై ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ విషయమై బాధితులు అధికారులకు ఫిర్యాదు చేయగా పశుసంవర్ధక శాఖ అధికారులు పంచనామ నిర్వహించారు. రూ.లక్షకు పైగా విలువైన ఎద్దులు మృతి చెందాయని ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

కిషన్‌నగర్‌లో..

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని కిషన్‌నగర్‌కు చెందిన రైతు ముకుందరెడ్డి చెందిన ఆవు పిడుగు పాటుకు గురై ఆదివారం సాయంత్రం మృతి చెందింది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామ శివారులోని పొలంలోని చెట్టుకు ఆవును కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో గాలిదుమారం, ఉరుములు, మెరుపులు రావడంతో పిడుగు పాటుకు ఆవు మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. ఆవు విలువ దాదాపు రూ.40వేల వరకు ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నారు.

సాగుకు సన్నద్ధం

- వంట పొలాలు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- నకాలంలో దుక్కులు సిద్ధం చేస్తేనే సత్ఫలితాలు
- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం



ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

మాగనూర్: వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు పెట్టుబడి సహాయం కూడా అందజేస్తుంది. ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు, వ్యవసాయ ఉపకరణాలు సమకూర్చుకోవాల్సిన సమయం ఇది. మార్కెట్‌లో ఆయా ఉత్పత్తులకు సంబంధించిన ప్రకటనలు ప్రజలను ఊరిస్తున్నాయి. విత్తనం కల్తీదైతే మొలకెత్తక ముందే రైతు చిత్తవుతాడు. ఎరువులు నాణ్యత లేకుంటే రైతుకు అప్పులు తప్ప ఏమి మిగలవు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే ముందు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకోవడం చాలా అవసరం.

తొలకరికి ముందే..

మండలంలోని కొత్తపల్లి, వాడ్వట్, తళంకేరి, నేరడగం, అడవిసత్యావర్, కొల్పూర్, మందిపల్లి, అమ్మపల్లి, వర్కూర్, ఉజ్జెల్లి తదితర గ్రామాల్లో తొలకరి జల్లులు కురవడంతో రైతులు ఖరీఫ్ సాగులో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో పలు రకాల కంపెనీల వారు గ్రామాల్లో వివిధ ప్రచార రథాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

డీలర్ల ఆఫర్లు

పలు కంపెనీలు డీలర్లకు రకరకాల ప్యాకేజీలు, విదేశీ, స్వదేశీ టూర్లు ఆఫర్ చేయడంతో డీలర్లు అవసరానికి మించి ఎక్కువ మొత్తంలో సదరు కంపెనీవారు విత్తనాలను, పురుగు మందులను రైతులకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నకలీ, నాసిరకం, విత్తనాలు మార్కెట్‌కు వస్తున్నాయి. రైతులు ఈ కంపెనీల వలలో పడి నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవడం పరిపాటిగా మారింది. వివిధ కంపెనీలు మండలంలోని గ్రామాల్లో రైతులను ఆకట్టుకునే విధంగా వాహనాల్లో తిరుగుతూ ప్రచారం చేస్తున్నాయి. రైతులు తొందరపడి నకిలీ, నాసిరకం విత్తనాలను కొనుగోలు చేసినట్లయితే నాణ్యత లోపంతో విత్తిన విత్తనం మొలకెత్తక, పంటదిగుబడి రాకపోవడం అప్పులు మిగులుతున్నాయి.

మోతాదుకు మించితే నష్టమే..


రైతులు అధిక దిగుబడులపై ఆశతో విత్తనాలతో పాటు ఎరువులను మోతాదుకు మించి వినియోగిస్తారు. ఇలా చేయడంతో దిగుబడి మాట దేవుడెరుగు కానీ నష్టాలనే చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పురుగు మందుల విషయంలోనూ మోతాదుకు మించి వాడొద్దని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు..

ప్రస్తుత కాలంలో గ్రామాల్లోని కొందరు దళారులు బయట నుంచి నకిలీ, నాసిరకం విత్తనాలను తీసుకొచ్చి రైతులకు అంటగడుతున్నారు. రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి. లైసెన్స్ ఉన్న షాపుల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు , మందులు కొనుగోలు చేయాలి.

- సుదర్శన్‌గౌడ్,
ఏఓ, మాగనూర్

రైస్ మిల్లులో కూలిన భారీ టవర్



కోస్గి: మండల పరధిలోని కడంపల్లి శివారులో ఉన్న శ్రీ ధనలక్ష్మీ పారాబాయిల్డ్, మహాలక్ష్మీ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో ఈదురు గాలులకు భారీ సామాగ్రి కూలిపోయింది. విద్యుత్ సరఫరా వ్యవస్థ, భారీ టవర్ కట్టడం కూలిపోయి మిల్లుపై పడటంతో యంత్రాలు సైతం దెబ్బతిని ఆస్తినష్టం జరిగినట్లు యజమాని సంతోష్ తెలిపారు. మిల్లులో కార్మికులు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని యజమాని తోపాటు కార్మికులు ఊపిరిపీల్చుకున్నారు.

నేడు నెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

ధన్వాద: రాష్ట్ర నెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు విక్రమ్ ఆదిత్యరెడ్డి ఆదేశానుసారం ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1 వరకు హైదరాబాద్‌లో జరిగే 7వ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ మహిళల, పురుషుల పోటీలలో పాల్గొనేందుకు జిల్లా జట్టు నుంచి ఈ నెల 27న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా నెట్‌బాల్ సంఘం ప్రతినిధులు డా. రామ్మోహన్‌గౌడ్, అంజద్‌అలీ తెలిపారు.

ప్రమాదకరంగా మలుపులు



కాన్‌కుర్తి సమీపంలో ప్రమాదకర మలుపు

దామరగిద్ద: దామరగిద్ద నుంచి యానుగుంది వెళ్లె ప్రధాన రహదారిలో కాన్‌కుర్తి సమీపంలో రోడ్డుపై మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం వేలాది వాహనాలు తిరిగే రోడ్డుపై ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోగా ద్విచక్ర వాహన దారులు అదుపు తప్పి మలుపు వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ ద్విచక్ర వాహనదారుడు అదపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. గత నాలుగేళ్ల కిత్రం రోడ్డు విస్తరణలోను మలుపును సరిచేసేందుకు పొలం యాజమాని ఒప్పుకోకపోవడంతో పాత రహదారి పైనే రోడ్డు నిర్మాణం చేశారు. ఈదే రహదారిపై అరకిలోమీటర్ దూరంలో కాన్‌కుర్తి సబ్‌స్టేషన్ సమీపంలో మరో మలుపు ప్రమాద భరితంగా ఉంది. ఇక గడిమున్కన్‌పల్లి సమీపంలోను మరోమలుపు ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మలుపులు సరిచేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం



మక్తల్: పట్టణంలోని డ్రాగన్ శోటో ఖాన్ కరాటే స్పోర్ట్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన టెస్టులో విద్యార్థులకు ఆదివారం జిల్లా మత్స్యకార మాజీ చైర్మన్ కోళ్ల వెంకటేష్, కరాటే నిర్వాహకులు ఎండీ సాలాబిన్ ఉమర్ చేతులమీదగా బెల్టులు ప్రధానం చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. కరాటేతో మానసిక ఉల్లాసన్నిస్తాయని, ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో జయశ్రీ,, అంబ్రేష్, శంషోద్దిన్, అంజన్‌ప్రసాద్, ఎండీ సలీం, శేఖర్, మోసిన్, ధరణి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని ఈదులబావితండకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త శంకర్‌నాయక్(40) ఇటీవల మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కు వచ్చింది. మృతుడి భార్య పేరుపై వచ్చిన చెక్కును ఆదివారం తండాకు చేరుకుని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు. పార్టీకి పనిచేసే వారికి ఎప్పుడు పార్టీ అండగా ఉంటుందని, ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, మల్లేష్, విశ్వేశ్వర్, గాడీల ప్రశాంత్, గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, గాదం పరమేష్, కౌన్సిలర్ తిరుపతయ్య ఉన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం

కొత్తకోట రూరల్: రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పట్టణ కేంద్రానికి చెందిన విశ్వనాథం వెంకటరమణను ఆదివారం పలువురు యజమానులు, వ్యాపారులు కలిసి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. రైస్ మిల్లుల యజమానుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రమణ, నర్సింహగౌడ్, రవితేజ, కవిందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి ఉన్నారు.

గతుకుల రోడ్లే దిక్కు

- పూర్తిగా ధ్వంసమైన మూలమల్ల రహదారి
- నిత్యం ప్రయాణికుల పాట్లు
- నిధులు మంజూరైన సాగని పనులు



ఆత్మకూర్ శివారులో గుంతలమయంగా మారిన మూలమల్ల రహదారి

ఆత్మకూర్: ఏళ్లు గడుస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నరక యాతన అనుభవిస్తున్నారు. మండలంలోని మూలమల్ల, నందిమల్ల గ్రామాలకు, జూరాల ప్రాజెక్టుకు వెళ్లేందుకు పట్టణంలోని పెట్రోల్‌బంకు మలుపు నుంచి మొదలుకుని 7కి.మీ. బీటీరోడ్డను ఏర్పాటు చేశారు. చిన్నపాటి వర్షం వచ్చిన రోడ్డు గుంతమయంగా మారుతున్నాయి. నీరు రోడ్డుపైనున్న గుంతల్లో చేరి ఇబ్బందికరంగా మారుతుంది. 2004లో వేసిన రోడ్డు ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. పదేళ్లుగా కొత్త బీటీరోడ్డు వేయించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఇప్పటికైన స్పందించి చర్యలు తీసుకోవాలని మూలమల్ల, నందిమల్ల గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.8.50 కోట్లతో రోడ్డు

మూలమల్ల మలుపు నుంచి నందిమల్ల, జూరాల ప్రాజెక్టు వరకు రూ.8.50 కోట్ల నిధులతో 2016లో రోడ్డు పనులు ప్రారంభించారు. మొదటి దఫా నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులను మధ్యలోనే వదిలేశాడు. ఈ విషయమై గ్రామస్తులు పలుమార్లు పీజేపీ కార్యాలయం వద్ద ధర్నా చేసిన నిధులలేమితో పనులు ముందుకెళ్లలేదు. పంచాయతీరాజ్ నిధుల నుంచి రోడ్డు వేయాలని కోరుతున్నారు.



జూరాలకాల్వ సమీపంలో ధ్వంసమైన రోడ్డు



నందిమల్ల శివారులో వర్షాకాలంలో రోడ్డు దుస్థితి

నిత్యం ప్రమాదాలు

నందిమల్ల నుంచి మూలమల్ల మీదుగా ఆత్మకూర్‌కు వెళ్లాలంటే భయమేస్తుంది. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇది వరకే ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పనులు కావడం లేదు. విషయాన్ని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లాం.

– అరవింద్‌రెడ్డి, నందిమల్ల

అధికారుల అసమర్థత

2016లో పుష్కరాలప్పుడు మంజూరైన రోడ్డు పనులు నేటికి కాకపోవడంతో పాలకులు, అధికారుల అసమర్థతే. నిత్యం ప్రమాదాలు అవుతున్నా, ప్రయాణికులు చనిపోతున్నా స్పందించకపోవడం పాలకుల పనితీరుకు నిదర్శనం. వెంటనే పనులను ప్రారంభించకపోతే ఉద్యమిస్తాం.

–భీమన్న, మూలమల్ల

పిడుగుల కాలం.. జర భద్రం

- ప్రతియేటా పిడుగుపాటుకు పశువులు, రైతులు బలి
- వర్షాకాలం ప్రారంభంలోనే పొంచి ఉన్న ప్రమాదం
- వజ్రపాత్ యాప్ ద్వారా పిడుగుల సమాచారం తెలుసుకోవచ్చు



స్మార్ట్ ఫోన్‌లో వజ్రపాత్ యాప్

కోస్గి: ఆకాశంలో ఉరుములు, మెరుపులతో భూమి మీద, ఎత్తైనా వృక్షాలపై పడే పిడుగులతో ప్రతియేటా మనుషులకు, పశువులకు ప్రాణనష్టం జరుగుతునే ఉంటుంది. సహజంగా వానాకాలం ప్రారంభ దశలోనే పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. ఉరుములు, మెరుపుల సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పిడుగుపాటు నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు...

- ఉరుములు, మెరుపుల వర్షం కురిసేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోను చెట్ల కింద ఉండొద్దు
- ఆ సమయంలో రైతులు పొలాల్లో ఉండకుండా వర్షంలో తడుస్తున్నప్పటికి ఇంటికి చేరుకోవాలి.
- వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలకు దూరంగా ఉండాలి.
- గొడుగుపై ఉండే ఇనుప బోల్టుతో రేడియేషన్ వచ్చే ప్రమాదం ఉన్నందున గొడుగులు సైతం వాడొద్దు.
- మెరుపులు కనిపించినప్పుడు అరచేతులతో చెవులు మూసుకొని, నేలపై మోకాళ్ల మీద కూర్చొని తల కిందకు వంచి ఉండాలి.
- ఆ సమయంలో విద్యుత్, ఎల్రక్టానిక్ పరికరాలు వాడొద్దు.
- కాంక్రీట్ నేలపై పడుకోవడం, గోడకు ఆనుకోవడం చేయొద్దు.
- విద్యుత్ వాహకాలైన ఇనుప తలుపులు, నీటిపైపులు తాకకూడదు.
- చివరి ఉరుము శబ్దం విన్న తర్వాత 30నిమిషాల వరకు ఇంట్లోనే ఉండాలి.

యాప్‌లో ముందస్తు సమాచారం..

పిడుగులు పడే అవకాశం ఉందనే ముందస్తు సమాచారం సైతం అందించే అదునాథన సాంకేతిక పరిజ్ఞానం సైతం యాప్ రూపంలో అందుబాటులోకి వచ్చింది. ప్లేస్టోర్ నుంచి వజ్రపాత్ యాప్ ద్వారా పిడుగుల సమాచారం తెలుసుకోవచ్చు. యాప్ ముఖ చిత్రంపై ఎడమ చేతి వైపు పిడుగు గుర్తుపై నొక్కితే మనం ఉన్న ప్రాంతం మ్యాప్‌లో వస్తుంది. ఎరుపు, నారింజ, పసుపు రంగుల్లో వలయాలు, వాటి పక్కన అంకెలు ఉంటాయి. ఉరుములు, మెరుపులు ప్రారంభం కాగానే కొద్ది సేపట్లో ఎంత దూరంలో పడుగుపడే అవకాశం ఉందో పిన్ గుర్తుతో చూపిస్తుంది. యాప్‌లో కుడి భాగంలో నొక్కితే పిడుగు పడే అవకాశం ఉందా? లేదా ? అనే సమాచారం వస్తుంది. పిగుడు పాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మనం ఎంచుకునే భాషలో వివరిస్తుంది. ఈ యాప్‌ను వినియోగించి పిడుగుపాటు ప్రమాదాల నుంచి ముందుగానే తప్పించుకునే అవకాశం ఉంది.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి..



పాడి రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో తమ విలువైన పశు సంపదను కాపాడుకోవచ్చు. వాతావరణంలో మార్పులను చూసిపిడుగు పడే అవకాశాలను రైతులు ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. ఏ మాత్రం అనుమానం ఉన్న పశువులను బహిరంగ ప్రదేశాల నుంచి వెంటనే పశువుల పాకాల్లోకి తరలించడంతో ప్రమాదాన్ని నివారించవచ్చు. ఫోన్‌ల ద్వారా సాంకేతికను వినియోగించుకొని ప్రాణాలను కాపాడుకోవచ్చు.

- విజయలక్ష్మి, పశువైద్యాధికారి, కోస్గి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నారాయణపేటలో పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: ఏకంగా 25 సంవత్సరాల తర్వాత చిన్ననాటి మిత్రులు ఒకేచోట కలుసుకున్నారు. 1998–99 విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. అదే సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న రెండు వేర్వేరు పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు ఒకే రోజు ఆయా పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని దయానంద విద్యా మందిర్ స్కూల్‌తోపాటు మండలంలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన ఆ విద్యా సంవత్సరం చదువుకున్న విద్యార్థులు ఒక చోట కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం వారికి విద్యాబోధన చేసిన గురువులను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

మరికల్: మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 2002–03 చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే వద్ద కలిశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయుల సేవలను గుర్తుచేసుకుని ఒకరికొకరు తమ అభిప్రాయలు తెలుపుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. అలాగే మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 1987–88 చదివిన పూర్వ విద్యార్థులు ఒకే దగ్గర కలిశారు. ఈ రిటైర్డ్ ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేసుకుని ఘనంగా సన్మానించుకున్నారు.

ఊట్కూర్: మండలంలోని అవుసలోనిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 1నుంచి 4వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకొన్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. డాక్టర్ లీయాకత్ అలీ, పూర్వ విద్యార్థులు రాంప్రసాద్, హన్మంతు, గోవర్ధన్, నర్సింహులు, రమేష్, శివరాములు, బాల్‌రాజ్ పాల్గొన్నారు.



అవులసలోనిపల్లిలో..



మరికల్‌లో..

ఉత్సాహంగా కిడ్స్ ఫెస్టివల్



సూపర్ కిడ్ విజేత యేబేలును సన్మానిస్తున్న పాస్టర్ పరంజ్యోతి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రెమా చర్చ్‌లో పాస్టర్ బీఎస్.పరంజ్యోతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కిడ్స్ ఫెస్టివల్ ఉత్సాహంగా జరిగింది. ఈ ఏడాదికిను సూపర్ కిడ్‌గా నిలిచిన యేబేలును పరంజ్యోతిని ఘనంగా సత్కరించి కిరిటాన్ని బహుకరించారు. పాస్టర్ పరంజ్యోతి మాట్లాడుతూ చిన్నారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది వేసవిలో కిడ్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించిన కిడ్స్ ఫెస్టివల్‌లో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 200 మంది చిన్నారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రసన్నకుమార్, గోదావరి ఖనికి చెందిన సిస్టర్ యూనిస్ బైబిల్‌పై ఆటలు, స్కిట్స్, క్రాఫ్ వర్క్స్, కొరియోగ్రఫీ, సంగీతం లాంటి అంశాలు నిర్వహించినట్లు తెలిపారు. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారిని ఈ ఏడాదికి కిడ్స్ విజేతగా ఎంపిక చేస్తామని, అందులో భాగంగా యేబేలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్న ప్రతి చిన్నారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కిడ్స్ ఫెస్టివల్ ముగింపు సందర్భంగా చిన్నారులంతా ఆట, పాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్యామ్ కమలాకర్, స్వర్ణన్‌రాజు, ఎస్తేరు, మణెమ్మ, బ్లాండీనా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులతో కాలనీవాసుల వాగ్వాదం



పనులను అడ్డుకుంటున్న కాలనీవాసులు

అమరచింత: పట్టణంలోని మూడో వార్డులో గల కాళికామాత ఆలయ ఆవరణలో నాలుగు రోజులుగా నిలిచిన వర్షపు నీటిని మళ్లించడానికి వచ్చిన మున్సిపల్ కార్మికులతో కాలనీ వాసులు వాగ్వాదానికి దిగారు. దేవాలయం పక్కనే ఉన్న మురుగు పరిస్థితితో పాటు వర్షపు నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కరం చూపాలని తాత్కాలికంగా పనులు చేసి వెళ్లిపోతే ఎలా అని కార్మికులు చేస్తున్న పనులను అడ్డుకున్నారు. నాలుగు రోజులుగా సమస్యపై పత్రికల్లో వస్తున్న వార్తలపై మున్సిపల్ అధికారులు ఆదివారం తమ పారిశుద్ధ్య కార్మికులతో వాటిని పూర్తి చేయడానికి వచ్చారు.

శాశ్వత పరిష్కారం కావాలి..

తమ వార్డులోని మురుగు ముందుకు వెళ్లలేక కంటను తలపిస్తుందని శాశ్వతంగా పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ విజయరాములు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఇప్పటి వరకు పట్టణంలోని వార్డులలో ఎలాంటి సమస్యలు ఉన్నాయే అన్న విషయాలను సైతం గుర్తించలేదని వాపోయారు. తమ వార్డు ప్రజల కోరిక మేరకు శాశ్వత పరిష్కార పనులు చేపట్టాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేస్తామన్నారు.